


నెరవేరనున్న కల..

అడ్డాకుల మండలంలోని వర్నె వాగుపై బ్రిడ్జి కల ఎట్టకేలకు నెరవేరబోతోంది.

వివరాలు 8లో ▸



ఫీట్లు తప్పవిక!

జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఏడాదిగా అవస్థలు పడుతున్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 /21.0

మధ్యాహ్నం తీవ్ర ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి కొద్దిమేర చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



అయిజ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశం అభివృద్ధి చెందుతుందని.. ప్రతిఒక్కరూ పార్టీని ఆదరించాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మోసపూరితమైన హామీలిచ్చి అధికారాన్ని దక్కించుకొని ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాలు భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతులకు రుణమాఫీ.. ఇలా ఎన్నో హామీలు ఇచ్చి మోసంచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. బీఆర్ఎస్ నియంతృత్వ, అవినీతి పాలనను అంతమొందించేందుకు సమయం ఆసన్నమైదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, సంక్షేమ పథకాలు సరిగ్గా అమలు కాకపోవడంతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ



అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఆరోపించారు. అలంపూర్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అదానీ లాంటి పెట్టుబడిదారులకు అమ్ముతుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజలను చైతన్యం చేయడానికి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి సీపీఎం పార్టీ అధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు చేపడుతున్నామని, ఈ నెల 24వ తేదీన ప్రారంభమయ్యే యాత్ర 29వ తేదిన గద్వాలకు చేరుకుంటుందన్నారు. సీపీఎం పార్టీ నాయకులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరై యాత్రను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రాజు, దేవదాసు, పరంజ్యోతి, ఈదన్న, మండలాల కార్యదర్శులు నరసింహ్మా, విజయ్ కుమార్, వెంకటేష్, చెన్నరాయుడు, నాగరాజు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్టీ గురుకులాల పరిధిలోని ప్రతిభ కళాశాలల్లో ఎస్సెస్సీ పూర్తయిన వెంటనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,494 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 1,404 మంది హాజరవగా.. 90 మంది గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు.

వైభవంగా తిరుచ్చిసేవ

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుంచి స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఈ సేవను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



సర్వం సిద్ధం

నేడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు

- జిల్లాలో 11పోలింగ్ స్టేషన్లు.. 877మంది ఓటర్లు
- ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగనున్న ఓటింగ్

గద్వాల రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుండగా 877 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఈ ఎన్నిక నిర్వహించనుండగా మొత్తం 21మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల నిర్వాహణకు అవసరమైన సామగ్రిని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూటరీ సెంటర్ నుంచి సిబ్బందికి పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు..

జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. మొత్తం 11 పోలింగ్ స్టేషన్లకు అవసరమైన ఎన్నికల సామగ్రిని ఆదివారం మధ్యాహ్నానికే తరలించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ ఆఫీసర్‌తోపాటు ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్, రూట్, నోడల్ అధికారులు, డిస్ట్రిబ్యూషన్ సిబ్బందితో కలిపి మొత్తం 55 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఓటింగ్ నిర్వహణ తీరు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ర్యాంపుల ఏర్పాటు, వీల్ చైర్లను అందుబాటులో ఉంచనున్నారు.



సామగ్రి తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల కేంద్రానికి బస్సులో సామగ్రితో బయలుదేరిన సిబ్బంది



జిల్లా కేంద్రంలోని ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

గద్వాల రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎన్నిక నిర్వహణకు అవసరమైన సామగ్రి పంపిణీతోపాటు, వివిధ శాఖలకు చెందిన అధికారులకు విధులు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 877 ఓటర్లు ఉండగా.. 11 పోలింగు స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. గద్వాలలోని మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ స్టేషన్‌లో 482 మంది ఓటర్లను కేటాయించడం జరిగిందని, అలాగే ధరూరులో 40, గట్టు జెడ్పీ పాఠశాలలో 12, మల్దకల్‌లో 22, వడ్డేపల్లిలో 76, రాజోళిలో 24, అలంపూర్‌లో 60, ఇటిక్యాలలో 54, మానవపాడులో 33, ఉండవెల్లిలో 29 మంది ఓటర్లను కేటాయించామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 11 మంది ప్రిసైడింగ్ అధికారులు, 11 ఏపీఓలు, 12 మంది ఓపీఓలు, 11 మంది మైక్రోఅబ్జర్వర్లు, ఐదుగురు సెక్టోరియల్, ఐదుగురు రూట్ ఆఫీసర్లు మొత్తం 55 మందిని నియమించడం జరిగిందన్నారు. పోలింగులో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ కనపడకుండా లైవ్ వెబ్ క్యాస్టింగ్ చెక్ చేసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు హైదరాబాదుకు చేరే వరకు మైక్రోఅబ్జర్వర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఆర్డీఓ రాములు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, డీఏఓ గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో పోలింగ్ తీరును ఉన్నతాధికారులు లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. బ్యాలెట్ బాక్సులను తెరవకముందే సంబంధిత ఏజెంట్లకు చూపి వారి సంతకం తర్వాతే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ అనంతరం

లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ..

బ్యాలెట్ బాక్సులను హైదరాబాద్‌లోని స్ట్రాంగ్ రూం వరకు సురక్షితంగా చేర్చే బాధ్యతను సంబంధిత మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించనున్నారు. పోలింగ్ కేంద్రానికి సుమారు 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ కొనసాగనుండగా, ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ భారీ బందోబస్తు చేపట్టనుంది. కౌంటింగ్ ప్రక్రియను ఈనెల 16న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో చేపట్టనుండగా.. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

లక్ష్యం వైపు అడుగులు



ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న గద్వాల ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసాచారి

- ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన
- సాగు చేపట్టిన వారికి ప్రోత్సాహకం
- జిల్లాలో 4,690 ఎకరాల్లో సాగుకు ఉద్యానవన శాఖ చర్యలు

గద్వాల వ్యవసాయం: వంట నూనె అందించే ఆయిల్‌పాం తోటల సాగుపై ఉద్యానశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రెండేళ్ల క్రితం ఈ సాగుకు ఆసక్తి గల రైతుల చేత ఆరంభించిన అధికారులు గడిచిన ఏడాది (2021–22) చాలామంది రైతుల చేత సాగు చేయించి విజయవంతమయ్యారు. ఈ ఏడాది (2022–23) లక్ష్యం మేరకు ఆయిల్‌పాం సాగయ్యేలా ఉద్యానశాఖ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. కాగా పామాయిల్ తోటలకు ఇసుక, ఒండ్రుతో కూడిన ఎర్రని నేలలు అనుకూలం. జిల్లాలో ఇలాంటి నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వీటి సాగుపై దృష్టి సారించారు. 2020 ఆరంభంలో జిల్లా రైతులను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట, భద్రాద్రి కొత్తగూడెంకు తీసుకెళ్లి అక్కడి తోటలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఇలా పలు ప్రయత్నాలు చేసి 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలలో పామాయిల్ సాగులోకి తెచ్చారు. ఇదే సమయంలో మొక్కల కొరత రాకుండా, అడిగిన ప్రతి రైతుకు మొక్కలు ఇచ్చేందుకు బీచుపల్లిలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లులో టీఎస్ ఆయిల్ ఫెడ్ రెండు ఎకరాల్లో ప్రత్యేకంగా ఆయిల్‌పాం నర్సరీని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక దృష్టి

2022–23 ఆర్థికసంవత్సరానికి సంబంధించి పెద్ద ఎత్తున ఆయిల్‌పాం సాగయ్యేలా ఉద్యానశాఖ చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. ఉద్యానశాఖ సిబ్బంది, ఏఈఓలు ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వెంటనే రైతులను పాలాలను సందర్శిస్తున్నారు. సంబంధిత రైతు పొలంలో నీటి వసతి, నేలలు అనుకూలంగా ఉంటే ఆలస్యం చేయకుండా సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ అందించి ప్రోత్సహిస్తున్నారు. ఈక్రమంలో గడిచిన రెండేళ్లతో పోల్చితే ఈఏడాది సాగు చాలా వరకు పెరిగింది.

రైతులకు ప్రోత్సాహకం

ఆయిల్‌పాం తోటల సాగుకు ముందుకు వచ్చే రైతులకు 2020–21లో రూ.150కు వచ్చే ఒక పామాయిల్ మొక్కను సబ్సిడీపై రూ.27కు అందించారు. ఖర్చులు పెరిగిన దృష్ట్యా 2021–22 నుంచి నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద సబ్సిడీపై రూ.117 ఉండే మొక్కను రూ.33కి, పీఎంకేఎస్‌వై–టీఎస్ఎంఐపీ కింద సబ్సిడీపై డ్రిప్‌ను మంజూరు చేశారు. దీంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.2వేలు చొప్పున నాలుగేళ్ల పాటు రూ.8వేలు అందించనున్నారు. అంతర పంటలు వేస్తే నాలుగేళ్ల పాటు రూ. 2వేలు చొప్పున అదనంగా రూ.8వేలు ఇస్తారు. దీంతో పాటు డ్రిప్‌ను సన్న చిన్నకారు రైతులకు 90శాతం, పెద్ద రైతులకు 80శాతం సబ్సిడీపై అందిస్తారు. 12.5 ఎకరాల వరకు డ్రిప్ సబ్సిడీ ఉంటుంది.

అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం



ఆయిల్‌పాం తోటల సాగు లాభదాయకంగా ఉంటుంది. ఈ తోటలు సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, వివిధ పథకాల కింద సబ్సిడీలు అందించి ప్రోత్సహిస్తున్నాం. లక్ష్యం మేరకు సాగు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మహ్మద్ అక్బర్ అలీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి

జిల్లా సాగు వివరాలిలా.. (ఎకరాల్లో)

ఏడాది	లక్ష్యం	సాగైంది
2020-21	350	250
2021-22	1,500	1,480
2022-23	4,690	2625 (ఇప్పటివరకు)

రూ.1.20 లక్షలతో ఎలక్ట్రిక్ కారు తయారీ



హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ కారును ట్రయల్ రన్ చేసి చూపుతున్న బీచుపల్లి (రెడ్ టీషర్ట్)

- హైదరాబాద్ ప్రదర్శనలో బొంకూరు యువకుడి సత్తా

ఉండవెల్లి: ప్రస్తుత కాలంలో ఎలక్ట్రిక్ కారును కొనుగోలు చేయాలంటే రూ.15 లక్షలపైగా వెచ్చించాల్సిందే. కానీ, మండలానికి చెందిన ఓ యువకుడు రూ.1.20 లక్షలు వెచ్చించి సొంతంగా ఎలక్ట్రిక్ కారును తయారు చేశాడు. అంతేగాకుండా ఈ కారు పంట పొలాల్లోనూ సులువుగా వెళ్లేలా.. ఐదు క్వింటాళ్ల వరకు బరువు లాగే సామర్థ్యంతో తీర్చిదిద్దాడు. ఈ విషయం తెలుసుకున్న కొన్ని ప్రైవేట్ కంపెనీలు హైదరాబాద్‌లో నిర్వహించే కార్నివాల్‌కు ఆహ్వానించడంతో అక్కడి ప్రదర్శనలో కారుతో సత్తా చాటాడు. పూర్తి వివరాలిలా.. ఉండవెల్లి మండల బొంకూరుకు చెందిన బీచుపల్లి బీకాం వరకు చదివాడు. పేదరికం కారణంగా డీజిల్ ఆటో నడుపుతూ కుటుంబానికి చేదోడుగా నిలిచేవాడు. అయితే, ఎప్పటి నుంచో ఎలక్ట్రిక్ కార్ల మీద మక్కువ ఉండేది. కానీ, అంత డబ్బు లేకపోవడంతో కొన్నాళ్లు కర్నూలులో డీజిల్ ఆటో నడిపేవాడు.

డీజిల్ ఆటోను సొంతంగా ఎలక్ట్రిక్‌గా మార్చి..

ఈ క్రమంలోనే డీజిల్ ఆటోను ఎలక్ట్రిక్ ఆటోగా మార్చి నైపుణ్యం పొందాడు. అనంతరం ఎలక్ట్రిక్ కారు తయారు చేయాలని ప్రయత్నాలు షురూ చేశాడు. ఆటోమొబైల్ రంగాల్లో నిష్ణాతులైన వారి సూచనలు, సలహాల మేరకు ఆయా ప్రాంతాల్లో విడి భాగాలు సేకరించి ఎలక్ట్రిక్ కారు తయారీ ప్రారంభించాడు. మొత్తం రూ.1.20 లక్షలతో ఒక్కసారి చార్జ్ చేస్తే వంద కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం గల కారును తయారు చేశాడు. మిగతా కార్లలా కాకుండా పొలాల్లోనూ ప్రయాణించేలా దీనిని తీర్చిదిద్దాడు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లోని కార్నివాల్ ప్రోగ్రాంలో కారును ప్రదర్శించాల్సిందిగా బీచుపల్లికి ఆహ్వానం రావడంతో ఆదివారం హైదరాబాద్‌కు కారును తీసుకొని వెళ్లి ప్రదర్శించాడు. బొంకూరు నుంచి హైదరాబాద్‌కు 200 కిలోమీటర్లకు గాను రెండుసార్లు చార్జ్ చేసుకొని వెళ్లినట్లు తెలిపాడు. పలు కంపెనీల ఎండీలు, సీఈఓలు కారును ప్రత్యక్షంగా రైడ్ చేసి పరిశీలించారని, పనితనాన్ని చూసి మెచ్చుకున్నారని బీచుపల్లి వివరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రేపల్లె దేవదాస్

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని వీటిని తిప్పికొట్టేందుకు పోరాటాలకు సిద్ధమవ్వాలని, అలాగే దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు నిత్యావసర ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు తక్కువ ధరకు అమ్మేసేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందని, బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నర్సింహ్మా, ఉప్పేరు నర్సింహ్మా, సీతారాములు, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఉల్లంఘనులపై కొరడా!

- రోడ్డు టాక్స్ బకాయిలు, చలాన్లు చెల్లించని వాహనాలు ఇక అంతే..
- జిల్లాలో రూ.1.96 కోట్ల ట్యాక్స్ బకాయిలు
- పన్ను చెల్లించని 3,060 రవాణా వాహనాల గుర్తింపు
- రవాణాశాఖ అధికారుల ప్రత్యేక డ్రైవ్
- ఇప్పటి వరకు 550వాహనాలు సీజ్.. రూ.32లక్షలు వసూలు



ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు జరిమానా విధిస్తున్న రవాణాశాఖ అధికారులు (ఫైల్)

గద్వాల క్రైం: రోడ్డు టాక్స్.. వాహన ఫిట్‌నెస్.. పర్మిట్.. ఇన్సూరెన్స్.. చలాన్లు.. ఇలా రవాణాశాఖకు చెల్లించాల్సిన టాక్సులను చెల్లించకుండా కొందరు వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి రాకపోకలు సాగిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలకు.. వంద శాతం వసూళ్లే లక్ష్యంగా రవాణా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈమేరకు జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేపట్టి పన్ను బకాయిలు ఉన్న వాహన యజమానులకు 200శాతం జరిమానా విధిస్తున్నారు.

ఆ వాహనాలకు క్లాంప్..

త్రైమాసిక పన్నులు.. చలాన్లు చెల్లించకుండా రోడ్డుపై తిరుగుతున్న వాహనాలకు క్లాంప్ వేసేందుకు జిల్లా రవాణాశాఖ అధికారులు గత నెల 16 తేది నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జిల్లాలో ఇలాంటి 550 వాహనాలను సీజ్ చేసి రూ.32.42లక్షలు పన్నుల రూపంలో వసూలు చేశారు. మరో 3,060 కమర్షియల్ వాహనాలు ట్యాక్స్‌లు చెల్లించకుండా రోడ్డుపై తిరుగుతున్నట్లు గుర్తించారు. పూర్తిస్థాయిలో అధికారులు శ్రమిస్తే మొత్తం బకాయిలు రూ.1.96 కోట్ల వసూలు చేయనున్నారు. పలు బృందాలుగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచారు. ప్రతి నిత్యం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతుండడంతో పన్నుల నుంచి తప్పించుకునేందుకు కొందరు తమ వాహనాలను రోడ్డుపైకి తీసుకువచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు.

పట్టుబడితే అదనపు జరిమానా

సకాలంలో వాహనాల పన్నులు చెల్లించే యాజమానులకు ఎలాంటి అదనపు జరిమానాలు ఉండావు. ఒకవేళ పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ.. ప్రత్యేక డ్రైవ్‌లలో పట్టుబడితే మాత్రం 200 శాతం మేర జరిమానా వేయనున్నారు. కాల పరిమితి దాటిన వాహన యజమానులకు ఇప్పటికే వ్యక్తిగత ఫోన్ నంబర్లకు మెస్సేజ్‌ల రూపంలో సమాచారం అందించారు. పన్నులు చెల్లించకుండా రోడ్డుపై అధికంగా తిరిగే వాటిలో లారీలు, బస్సులు, స్కూల్ బస్సులు, డీసీఎంలు, గూడ్స్ వాహనాలే ఉన్నాయి. అయితే అధికారులు తనిఖీ చేస్తున్న క్రమంలో పట్టుబడితే.. చోటామోటా నాయకులు, పైరవీకారుల నుంచి కాస్త చూసీ చూడనట్లు వదిలేయాల్సిందిగా ఒత్తిళ్లు రావడం రవాణా శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. మరో వైపు సీజ్ చేసిన వాహనాల ముడి భాగాలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటనలు ఉన్నాయి. ఇదిలాఉండగా, ఇప్పటివరకు రూ.32.42లక్షలు పన్ను బకాయిలు వసూలు చేయగా.. మరో 2,510 వాహనాల నుంచి వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల చివరి నాటికి ట్యాక్స్‌లు చెల్లించని వాహనాలపై కొరడా ఝుళిపించనున్నారు. వాహన రోడ్డు టాక్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ తదితర పన్ను బకాయిలు ఉన్నవారే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

పన్ను చెల్లించి సహకరించాలి



సకాలంలో యాజమానులు పన్నులు చెల్లించి ఎలాంటి అదనపు జరిమానాల భారిన పడకుండా స్వేచ్ఛగా రోడ్లపై తిరగవచ్చు. పన్నులు చెల్లించకుండా నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై తీరుగుతామంటే నేరం. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. తనిఖీలో పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తాం. ఇప్పటి వరకు 35 శాతం వాహనాల నుంచి ట్యాక్స్ వసూలు చేశాం. నెలాఖరులోగా 65 శాతం ట్యాక్స్ వసూలు చేసేలా కృషి చేస్తాం. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పరిధిలో ఉన్న పన్నులు చెల్లించి సహకరించాలి.

– పురుషోత్తంరెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి

క్లుప్తంగా

ఒంటికి నిప్పంటించుకుని మహిళ ఆత్మహత్య

జడ్చర్ల: ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కావేరమ్మపేటలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కావేరమ్మపేటకు చెందిన సుల్తానా భేగం(48) శనివారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే గమనించిన కుమారుడు ఖాదర్ చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలు కుమార్తె గౌసియా భేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి


అంజమ్మ(ఫైల్)

మరికల్: వ్యవసాయ పొలం వద్ద కంది కట్టెకు నిప్పంటించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మాదవరానికి చెందిన అంజమ్మ(26) శనివారం తన వ్యవసాయ పొలం వద్ద కంది కట్టెకు నిప్పంటించింది. ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల రైతులు గమనించి మంటలు ఆర్పి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

భార్యతో గొడవపడి భర్త బలవన్మరణం


కొండన్న(ఫైల్)

అడ్డాకుల: గ్రామంలో అందరూ వనభోజనాలకు వెళ్తే.. అదే విషయమై భార్యతో గొడవపడిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మూసాపేట మండలం తుంకినీపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుంకినీపూర్‌కి చెందిన బోయ గోపన్‌పల్లి కొండన్న(55), పద్మమ్మ దంపతులు. వారికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం గ్రామంలో వనభోజనాల కార్యక్రమం చేపట్టగా.. ఇదే విషయంలో భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. మనమరాలు అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆస్పత్రిలో ఉండగా.. ఊరు బయటకు మనం వెళ్తే బాగోదన్న విషయంలో ఇద్దరు వాదులాడుకున్నారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన కొండన్న చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు కొండన్న కుమారుడు రాఘవేందర్‌కు ఫోన్ చేశారు. హైదరాబాద్ వెళ్లడానికి మూసాపేట వద్ద బస్సు కోసం వేచి ఉన్న రాఘవేందర్ వెంటనే ఇంటికి వెళ్లి తన తండ్రిని కారులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కొండన్నను పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుని కుమారుడు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి.. వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చేపలు పట్టేందుకు వెళ్లి వలలో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలానికి చెందిన శాంతయ్య (52) కుటుంబంతో వచ్చి పటాన్‌చెరు శివారు బంగారుగడ్డ బాలజీనగర్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం శాంతయ్య, అతడి స్నేహితుడు ఆంజనేయులుతో కలిసి చేపలు పట్టేందుకు మూడు వాగుల గుంట వద్దకు వెళ్లాడు. ఆంజనేయులుకు ఈత రాక పోవడంతో ఒడ్డున ఉన్నాడు. శాంతయ్య వల తీసుకొని కుంటలో ఈదుకుంటూ వెళ్లాడు. మధ్యలోకి వెళ్లగానే కాలికి వల చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఆంజనేయులు విషయాన్ని మృతుడి భార్య నాగమ్మకు తెలపగా స్థానికుల సహకారంతో కుంటలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులు గజ ఈతగాళ్ల సాకారంతో గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాఠశాల కంప్యూటర్లు ధ్వంసం

బిజినేపల్లి: మండలంలోని పాలెం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కంప్యూటను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో కంప్యూటర్ గదిలోకి చొరబడి కంప్యూటర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఆదివారం తెల్లవారుజామున గమనించి గ్రామస్తులు ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెరవేరుతున్న కల


వర్నె వద్ద వాగులో కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

- వర్నె వాగులో కొనసాగుతున్న హైలెవల్ బ్రిడ్జి పనులు
- హైవే నుంచి కన్మనూర్ క్రాసింగ్ వరకు డబుల్ లైన్ బీటీరోడ్డు
- కన్మనూర్ క్రాసింగ్ నుంచి బ్రిడ్జి వరకు సింగిల్ లైన్ బీటీరోడ్డు


వర్నె వద్ద వాగులో తెగిన దారి (ఫైల్)

అడ్డాకుల: మండలంలోని వర్నె వద్ద వాగులో బ్రిడ్జి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఈసారి తెరపడనుంది. వర్షాకాలం వస్తే చాలు వాగు దాటాలంటే ప్రజలు నరకం అనుభవించేవారు. ఈ ఏడాది ఇద్దరు వ్యక్తులు వాగు దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయి చెక్‌డ్యాంలో మునిగి చనిపోయారు. కేఎల్ఐ ద్వారా మూసాపేట మండలం నుంచి పెద్దవాగులో వరద నీళ్లు దిగువకు వస్తుండటంతో సుమారు ఏడాదంతా వాగులో నీళ్లు వెళ్తుంటాయి. ఇదిలా ఉంటే వర్షాకాలంలో రోడ్డు కోతకు గురై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్న సంఘటనలు నాలుగైదు సార్లు కనిపించేది. వాగులో రోడ్డు కోతకు గురైనప్పుడు జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి మూడు సార్లు సొంత డబ్బులతో రోడ్డును బాగు చేయించారు. కాగా అడ్డాకుల, భూత్పూర్, ఖిల్లాఘనపురం మండలాలకు చెందిన కురుమూర్తి స్వామి భక్తులు ఇదే దారిలో ఆలయానికి వెళ్తారు. వాగులో రోడ్డు కోతకు గురైతే రాచాల మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో వాగులో బ్రిడ్జి నిర్మించాలని వర్నె, ముత్యాలంపల్లి గ్రామస్తులు డిమాండ్ చేయడంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్లు, భవనాలశాఖ ద్వారా రూ.18కోట్లను మంజూరు చేయించారు. గతేడాది జూన్ 6న పనులకు శంకుస్థాపన చేశారు.

కొత్త దారిలో బ్రిడ్జి నిర్మాణం

ప్రస్తుతం వాగులో ఉన్న దారి వంకరగా ఉంది. ఇదే తరహాలో వాగులో బ్రిడ్జి నిర్మాణం చేయించడానికి ఉన్నతాధికారులు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో పలుమార్లు ఉన్నతాధికారులు చర్చించి డ్రాయింగ్ ఫైనల్ చేయడానికి కొంత ఆలస్యమైంది. చివరికి వాగులో నేరుగా కొత్త దారిలో బ్రిడ్జి నిర్మాణం చేయాలని నిర్ణయించారు. దీని కోసం ఒక వైపు వాగు గడ్డపై కొంత భూమిని సేకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం మొదలైన బ్రిడ్జి నిర్మాణం పనులు కూడా వేగవంతమయ్యాయి. మరో రెండు, మూడు నెలల్లో పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రానుంది. భూసేకరణకు నిధులు కూడా కేటాయించారు. అనుకున్న సమయంలో భూసేకరణ పూర్తయితే మే నెల చివరి నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బ్రిడ్జి పూర్తయితే వర్నె, ముత్యాలంపల్లి గ్రామస్తులతో పాటు కురుమూర్తి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతం కానుంది.

ఆరు నెలలు ఆలస్యమైనా..

జూన్‌లో పనులకు శంకుస్థాపన చేసినా సకాలంలో పనులు మొదలు కాలేదు. కొన్నాళ్ల పాటు వాగులో వరద ఉధృతి తగ్గకపోవడం ఒక కారణమైతే, మరో వైపు వాగులో ప్రస్తుతం ఉన్న దారిపైనే బ్రిడ్జి నిర్మాణం చేయించడానికి వీలు లేకపోయింది. ఆర్అండ్‌బీ ద్వారా రూ.18కోట్లు మంజూరైతే ఇందులో రూ.9కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించారు. మిగతా రూ.9కోట్లతో జాతీయ రహదారి నుంచి బలీదుపల్లి మీదుగా కన్మనూర్ క్రాసింగ్ వరకు ఇప్పుడున్న బీటీరోడ్డును డబుల్ లైన్‌గా మార్చనున్నారు. దీంతో పాటు కన్మనూర్ క్రాసింగ్ నుంచి వాగు వరకు కొత్తగా సింగిల్ లైన్ బీటీరోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఇదిలా ఉండగా బ్రిడ్జి నిర్మాణం కోసం కేటాయించిన నిధుల్లోనే బలీదుపల్లి, కన్మనూర్ క్రాసింగ్, సోలార్ వద్ద మూడు కల్వర్టులను నిర్మించనున్నారు. ఇందులో రెండు కల్వర్టుల పనులు సగం వరకు పూర్తయ్యాయి. రెండు నెలల క్రితం వాగులో వరద ఉధృతి తగ్గడంతో ఆలస్యంగానైనా పనులు మొదలై చకచకా ముందుకు సాగుతున్నాయి.

మే చివరి నాటికి పూర్తకావొచ్చు



కొన్ని కారణాలతో అనుకున్న సమయంలో పనులు మొదలు కాలేదు. ఇప్పుడు పనులు వేగవంతమయ్యాయి. మూడు కల్వర్టుల్లో రెండు కల్వర్టుల పనులు కూడా కొనసాగుతున్నాయి. బీటీ రోడ్డు పనులు మొదలు కావాల్సి ఉంది. మే చివరి నాటికి వాగులో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. పనులను నాణ్యతగా చేయిస్తున్నాం.

– కౌశిక్, ఆర్అండ్‌బీ ఏఈ

11 రోజులు 283 మంది

ఇటీవల భారీగా పెరిగిన కుక్కకాటు బాధితులు

- జనరల్ ఆస్పత్రిలో ప్రతిరోజు 20- 30 మందికి చికిత్స
- మూడు నెలల్లో 1,930 మందిపై దాడి
- కుక్కకాటును నిర్లక్ష్యం చేయకూడదని వైద్యుల సూచన



పాలమూరు: ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా కుక్కల దాడి క్రమంగా పెరుగుతున్నాయి. ప్రతిరోజు జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో కుక్కకాటు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరిపై విచక్షణరహితంగా వెంట పడి దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతినిత్యం పదుల సంఖ్యలో బాధితులు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. అయితే కుక్క పంటిగాటు మనిషి శరీరంపై పడితే ప్రాణహాని ఉంటుంది. కుక్క కాటేసినప్పుడు నిర్లక్ష్యం చేయడం అంతమంచిది కాదు. ఒకవేళ కుక్క కాటుకు గురైతే వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించడం ఎంతో అవసరం. కొన్ని సందర్భాల్లో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఈ నెలలో కుక్కకాటు ప్రమాదాలు ఇలా..

తేదీ	బాధితులు
1న	17
2	25
3	35
4	26
5	19
6	20
7	24
8	37
9	21
10	30
11	29

ఆరేళ్లలో 32,942 మంది

గత ఆరేళ్ల కాలంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 32,942 మంది బాధితులు కుక్కకాటుకు గురయ్యారు. ప్రతి ఏడాది బాధితులు పెరుగుతుండగా.. రెండేళ్లుగా అయితే మరింత రెట్టింపు అవుతున్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు 20నుంచి 35మంది వరకు కుక్క కాటుకు గురై చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో అధికంగా పట్టణప్రాంతాలకు చెందినవారు ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే అర్బన్ ఏరియాలో కుక్కలు అధికంగా ఉండటం వల్ల మున్సిపాలిటీల్లో ఎక్కువగా కుక్కల దాడుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో చిన్నారులు ఆరుబయట ఆడుకునే సమయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

నిర్లక్ష్యం చేయొద్దు..

కరిచిన కుక్క ఎలాంటిదైనా వైద్యం మాత్రం ఒక్కటే అన్న విషయం మరువద్దు. పిచ్చి కుక్క కాటు ప్రాణాంతకం. నిర్లక్ష్యం చేస్తే కొద్దిరోజుల వ్యవధిలోనే మనిషికి కుక్క లక్షణాలు సంక్రమిస్తాయి. ఆ తర్వాత వైద్యులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. పెంపుడు కుక్కలతో ప్రమాదకరమైన ఆటలు ఆడొద్దు. కుక్క కరిచిన వెంటనే గాయమైన చోట సబ్బుతో శుభ్రంగా కడగాలి. తర్వాత సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. కుక్క కరిచిన రోజు, 3, 7, 14, 28వ రోజు ఒక్కో ఇంజెక్షన్ చొప్పున నాలుగు దఫాలుగా చికిత్స తీసుకోవాలి. ఎక్కువగా కరిస్తే 5వ సారి ఇంజెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక వైద్య బృందం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కుక్క కాటుకు గురైన వారికి చికిత్స అందించడానికి ప్రత్యేక వైద్య బృందం అందుబాటులో ఉంది. దీంతోపాటు ఇమోనోగ్లోబిన్ యాంటిబయాటిక్స్ సైతం ఉన్నాయి. అలాగే రేబిస్ వ్యాక్సిన్‌తోపాటు కావాల్సిన చికిత్స అందిస్తున్నాం. మనిషిని ఏ జంతువు కరిచిన రేబిస్ వ్యాధి సోకుతుంది. కాకపోతే కోతి, కుక్క కరవడం వల్ల ఎక్కువ హాని ఉంటుంది. కుక్క కరిచిన వాళ్లు నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత రేబిస్ వ్యాధి సోకితే ప్రాణనష్టం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలోని ప్రధానంగా పట్టణాలు, మున్సిపాలిటీల నుంచి బాధితులు అధికంగా వస్తున్నారు.

– రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

భారీ అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

- కుండల తయారీకి నిల్వచేసిన కట్టెలు అగ్నికి ఆహుతి
- భారీగా ఎగిసిన మంటలు
- ఆర్పిన ఫైర్‌సిబ్బంది


ఎగిసిపడుతున్న మంటలు

నారాయణపేట టౌన్: జిల్లాకేంద్రంలోని దామరగిద్ద రోడ్‌లో ఉన్న కుమ్మరివాడలో కుండల తయారీకి నిల్వ చేసిన కట్టెలకు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేయగా అప్పటికే కట్టెలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో స్తంభాలకు బిగించిన విద్యుత్ తీగలు కాలి తెగిపోయాయి. ఉగాది, వేసవి సందర్భంగా కుండల తయారీ కోసం పెద్దమొత్తంలో కట్టెలు కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నామని.. ప్రమాదంలో 10 ట్రాక్టర్ల కంది, 16 ట్రాక్టర్ల కట్టెలు కాలిపోయినట్లు బాధితులు సాయన్న, రమేష్, శాంతప్ప, దత్తు, విశ్వనాథ్, వెంకటప్ప, తమ్మప్ప, బంగ్లా జయమ్మ తెలిపారు. రూ.మూడు లక్షల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఫైర్ అధికారి వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో..

గద్వాల క్రైం: గద్వాల రెండో రైల్వేగేట్ సమీపంలో రతన్‌కు చెందిన రేకులషెడ్‌లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. కారు, రెండు ద్విచక్ర వాహనల పార్కింగ్ కోసం షెడ్ నిర్మించినట్లు వివరించారు.

పోస్టాఫీస్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం..

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పోస్టాఫీస్‌లో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బస్టాండ్ సమీపంలో ఉన్న పోస్టాఫీస్ ప్రాంగణం చివర్లో ఒక చిన్న గదిలో చిత్తు కాగితాలు వేసి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయటంతో మంటలు వ్యాపించాయి. పోస్టాఫీస్‌లోని అలారం మోగడంతో ఫైర్‌సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో గది పక్కనే ఉన్న ద్విచక్ర వాహనం పాక్షికంగా కాలిపోయింది.

రేషన్ బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేష్ ఆదివారం తెలియజేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాలలోని పిల్లిగుండ్లకి చెందిన శాంతప్ప ఎరుకలి హనుమంతు వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయిచూర్‌కు ట్రాలీఆటోలో తరలిస్తున్నాడు. మండలంలోని మల్లాపురం శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు చేపట్టగా.. పట్టుబడినట్లు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి శాంతప్ప, ఎరుకలి హనుమంతుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

15లీటర్ల సారా స్వాధీనం



అచ్చంపేట రూరల్: సారాను బైక్‌పై తరలిస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం మండలంలోని లింగోటం తండా సమీపంలో అచ్చంపేట ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. లింగోటం తండాకు చెందిన ఘాన్సీరాం తన బైక్‌పై 15 లీటర్ల సారాను అచ్చంపేటకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో పట్టుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్ఐలు బాలరాజు, సతీష్ కుమార్ తెలియజేశారు. నల్లబెల్లం సరఫరా చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్‌పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం వెంకటాంపల్లి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కుర్వ రాములమ్మ(45) మండలంలోని వెంకటాంపల్లిలో బొడ్రాయి పండుగ కోసం ఆడపడుచు నాగమ్మ ఇంటికి వచ్చింది. ఆదివారం తిరిగి స్వగ్రామానికి బంధువుల అబ్బాయి బైక్‌పై వెళ్తుండగా వెంకటాంపల్లి శివారులో ప్రమాదవశాతు జారి రోడ్డుపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాములమ్మ భర్త గతంలోనే మృతిచెందగా.. ఓ కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ.. నగదు అపహరణ

అమరచింత: మండలంలోని మస్తీపురంలో కవితారెడ్డి ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చొరబడి రూ.రెండు లక్షల నగదు, మూడు కిలోల వెండి సామగ్రి ఎత్తుకెళ్లారని ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన కవితారెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా గ్రామంలోనూ ఇల్లు ఉంది. తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, వెండి ఎత్తుకెళ్లారని.. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆత్మహత్య చేసుకోడానికి వెళ్లిన వ్యక్తి..

రక్షించిన కానిస్టేబుల్


ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లిన తిరుపతయ్యను తీసుకొస్తున్న కానిస్టేబుల్ లింగం

ఖిల్లాఘనపురం: కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తిని కానిస్టేబుల్ కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఖిల్లాఘనపురంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెంకటాంపల్లికి చెందిన కుర్వ తిరుపతయ్య తన తండ్రి శ్రీశైలంతో గొడవ పడి ఆత్మహత్య చేసుకోవడానికి మండల కేంద్రంలోని సొడమ్మ గుట్టపైకి వెళ్లాడు. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులు ఖిల్లాఘనపురం పోలీసులకు తెలియజేశారు. దీంతో కానిస్టేబుల్ లింగం వెంటనే స్పందించి తిరుపతయ్య సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వనపర్తి ఐటీ సెల్ సహకారంతో లొకేషన్ తెలుసుకుని వ్యక్తిని వెతికి తీసుకొచ్చాడు. కౌన్సెలింగ్ ఇచ్చి ఆయన్ను కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీహరి తెలియజేశారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


తప్పిపోయిన చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కోస్గి: వారాంతపు సంతకు తల్లితో కలిసి వచ్చిన ఓ చిన్నారి తప్పిపోవడంతో గుర్తించిన పోలీసులు గంటల వ్యవధిలోనే తిరిగి అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తోగాపూర్ చెందిన మంగమ్మ తన ఐదేళ్ల కూతురు స్వప్నను తీసుకుని పట్టణంలోని ఆదివారం సంతకు వచ్చింది. ఈ క్రమంలో చిన్నారి తప్పిపోయింది. ఏడుస్తున్న చిన్నారిని చూసి కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిన్నారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం పోలీస్ వాహనంలో తప్పిపోయిన చిన్నారి విషయాన్ని మైక్ ద్వారా ప్రకటించి తల్లి ఆచూకీ తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో చిన్నారిని తల్లికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలకు తిరిగొస్తున్న విద్యార్థులు


విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

మన్ననూర్: విద్యార్థిని మృతితో భయాందోళనకు గురై తమ ఇళ్లకు వెళ్లిన విద్యార్థులను తిరిగి పాఠశాలకు రప్పించేందుకు ఆర్సీఓ వనజ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలిక)లో ఈ నెల 6న 7వ తరగతి విద్యార్థిని అఖిల తరగతి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆందోళనకు గురైన కొందరు ఉపాధ్యాయులు సెలవు పెట్టుకుని వెళ్లినట్లు తెలిసింది. పాఠశాల ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోవడానికి సైతం ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఆర్సీఓ వనజ మూడు రోజులుగా పాఠశాలలోనే ఉంటూ విద్యార్థులను పాఠశాలకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ఉన్నందున విద్యార్థులు వెంటనే పాఠశాలకు రావాలని కోరుతున్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ పాఠశాలలోనే ఉండి వచ్చే విద్యార్థులను చేర్పిస్తున్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌ల వివరాలు తీసుకుని బస్సు ఏర్పాటు చేసుకొని విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందుకు ఆర్సీఓ తెలిపారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులందరినీ ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి చదివిస్తున్నారు.

తవ్విన కొద్దీ... 'చీట్స్'

అక్రమాలపుట్ట మార్గదర్శిలో నలుగురు మేనేజర్ల అరెస్టు ● ఒక్క రూపాయి కూడా లేకుండా కంపెనీ పేరిట వేలాది చిట్టీలు

సాక్షి, అమరావతి: సోదాలు చేస్తున్న కొద్దీ అక్రమాల పుట్టగా బయటపడుతున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ వ్యవహారంలో అరెస్టులకు తెరలేచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు... నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసి ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇప్పటికే ఏ1గా రామోజీరావును, ఏ2గా చెరుకూరి శైలజను, ఏ3గా బ్రాంచి మేనేజర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సీఐడీ... ఫోర్‌మన్లుగా పిలిచే కామినేని శ్రీనివాసరావు (విశాఖ- సీతమ్మధార బ్రాంచి), సత్తి రవి శంకర్ (రాజమండ్రి), బి.శ్రీనివాసరావు (విజయవాడ- లబ్బీపేట), గొరిజవోలు శివరామకృష్ణ (గుంటూరు)లను అరెస్టు చేసి ఆయా ప్రాంతాల్లో న్యాయమూర్తుల ఎదుట హాజరు పరిచారు. వీరిలో కొందరికి 24 వరకూ రిమాండు విధించారు. ఈ సందర్భంగా వెలుగుచూసిన అక్రమాలు అధికారులను సైతం దిగ్భ్రాంతికి గురిచేశాయి. చిట్ సభ్యుల స్థానంలో వేల చిట్లలో తమ పేరే రాసేసుకున్న మార్గదర్శి సంస్థ... నిబంధనల మేరకు దానికి పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు!!. చిట్లలో తనకు వచ్చే కొద్ది పాటి డిస్కౌంట్ల మొత్తాన్నే దాదాపు అన్ని చిట్లలోనూ డూప్లికేట్ చేసి చూపించి... దాన్నే తమ సొమ్ముగా పేర్కొనటంతో, ఇదంతా పచ్చి 'గొలుసు' వ్యవహారంగా మారిపోయింది. గొలుసులో ఏ చిన్న లింకు తెగి నా... ఇది సంస్థ దివాలాకు దారి తీసే ప్రమాద ముంది. అదే జరిగితే చిట్ సభ్యుల సొమ్ము వాళ్లకు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్త మవుతోంది. దీంతోపాటు చిట్లలకు వేర్వేరు బ్యాంకు ఖాతా లను నిర్వహించాల్సి ఉండగా... అన్నిటికీ ఒకే ఖాతాను నిర్వహిస్తూ వాటిలో డబ్బును ఇష్టం వచ్చినట్టుగా మళ్లించటం కూడా విస్మయం కలి గిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో గ్రూపు సంస్థల్లోకి కోట్లాది రూపాయలు మళ్లిస్తుండటంతో పాటు... హైరిస్క్ ఉండే మ్యూచ్‌వల్ ఫండ్స్‌లోకి కూడా ఈ ఖాతా నుంచి చిట్ సభ్యుల సొమ్మును మళ్లించటం గమనార్హం. వీటన్నిటితో పాటు... చట్ట విరుద్ధ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసే సినా డిపాజిట్లు తీసుకోవటం మాత్రం రామోజీ రావు ఆపలేదని తాజా సోదాల్లో వెల్లడయింది. చిట్ సభ్యుల నుంచి అక్రమంగా డిపాజిట్లు తీసుకుంటూ... బ్యాంకుల్లో అయితే వాటిపై టీడీఎస్ (ఆదాపు పన్ను) చెల్లించాలని, తమ దగ్గరైతే అలాంటిదేమీ ఉండదని నమ్మబలుకుతుండటం మోసాలకు పరాకాష్టగా అధికారులు చెబుతున్నారు. ఆ అక్రమాల వివరాలివీ...

ఒక్క రూపాయి చెల్లించకుండా... తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని 27, 32 సెక్షన్లలో నిర్దేశించిన ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. కానీ వాటికోసం మార్గదర్శి ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు ప్రతికూలించి కొన్ని గ్రూపుల్లో చిట్ల సభ్యులు తమ చందా చెల్లించలేకపోతే... ఇక మిగతా వాళ్లకు చిట్లు పాడుకున్నా సరే డబ్బులు రావటం కష్టం. ఎందుకంటే కంపెనీ పేరిట ఉన్న వేటికీ డబ్బులు లేవు కాబట్టి!!.

ఇదిగో ఉదాహరణ.... ఎంసీఎఫ్ గుంటూరు బ్రాంచిలో 45 గ్రూపుల చిట్టీలు వేశారు. వాటిలో మొత్తం 2,040 టికెట్లు (చందాదారులు) ఉన్నాయి. 858 టికెట్లు మార్గదర్శివే. వాటి చందాగా మార్గదర్శి రూ.16.96 కోట్లు చెల్లించాలి. కానీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బ్రాంచి మేనేజర్(ఫోర్‌మేన్) అంగీకరించారు. కేవలం రికార్డుల్లో ఎంట్రీలను అటూ ఇటూ జంబ్లింగ్ చేసి చూపిస్తోంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ మొత్తంగా 2,300 చిట్టీలను నిర్వహిస్తోంది. వాటిలో లక్షమందికిపైగా చందాదారులున్నారు. వాటిలో కొన్ని వేల టికెట్లు మార్గదర్శివే. కానీ సంస్థ యాజమాన్యం తన వాటాగా ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. గొలుసు కట్టు మాదిరిగా ఒక చిట్ సొమ్మును వేరే చోట సర్దుబాటు చేస్తూ... కొందరికి ష్యూరిటీల పేరిట ఆలస్యం చేస్తూ... మరికొందరికి డిపాజిట్ల పేరిట తరవాత ఇస్తామని చెబుతూ రోజులు నెట్టుకొస్తోంది. అదీ కథ.

ఒక్క బ్యాంకు ఖాతా చాలట!!

చిట్‌ఫండ్ సంస్థలు తమ నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. చిట్టీల ఒప్పందాల్లో బ్యాంకు పేరును చెబుతోంది తప్ప ఖాతాల నంబర్లు, ఇతర వివరాలను ఇవ్వటమే లేదు. ప్రతి చిట్టీకీ ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉండాల్సి ఉండగా... దాన్నీ పాటించటం లేదు. అన్నీ ఒకే బ్యాంకు ఖాతాలో భారీగా పోగేస్తోంది. నిజానికిదో పెద్ద ఆర్థిక కుట్ర. నిబంధనల ప్రకారం చిట్టీల బ్యాంకు ఖాతాలపై సదరు బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు చెక్ పవర్ ఉండాలి. ఆ మేనేజరే అన్నీ చూడాలి. కానీ మార్గదర్శిలో ఏ బ్రాంచి మేనేజర్‌కూ చెక్ పవర్ లేదు. అంతా హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచే నడిపిస్తున్నారు. అక్కడ ఒకరికే చెక్ పవర్ కల్పించడం వెనుక గూడుపుఠాణి ఏమంటే... ఆ ఖాతా నుంచి నిధులు మళ్లించటం ఈజీ కనక. మ్యూచువల్ ఫండ్స్, ఇతర స్టాక్ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టడం నేరమైనా... మార్గదర్శి చేస్తున్నది అదే. తమ గ్రూపు సంస్థ ఉషోదయ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5శాతం వాటాను మార్గదర్శి చిట్స్ కొనుగోలు చేసింది. ఇతర సంస్థల్లోకీ అక్రమంగా నిధులు మళ్లించింది. హైరిస్క్ ఉన్న వీటిలో పెట్టుబడులు పెడుతున్నట్లు చందాదారులకు కనీసం తెలియకుండా... దశాబ్దాలుగా రామోజీ సాగిస్తున్న ఆర్థిక దోపిడీ ఇది.

డిపాజిట్లు సేకరించటం నేరమే అయినా...

చిట్టీ పాడిన చందాదారుడికి చిట్టీ మొత్తం చెల్లించినట్టుగా చిట్స్ రిజిస్ట్రార్‌కు చూపిస్తున్న మార్గదర్శి... ఆ చందాదారుడికి పూర్తిగా చెల్లించకపోవటం గమనార్హం. ష్యూరిటీలు సరిగా లేవన్న కారణాలతో పలువురు చందాదారుల నుంచి ఫ్యూచర్ సెక్యూరిటీ పేరిట మిగిలిన కాలానికి చెల్లించాల్సిన చందాను తమ వద్దే ఉంచుకుంటున్నారు. దానికి ఓ రశీదు ఇస్తున్నారు. దానిపై 4-5 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఇలా డిపాజిట్లు సేకరించటం చట్టప్రకారం నేరం. రామోజీ మాత్రం అదేమీ పట్టించుకోవటం లేదు. దానికి ఇదిగో ఉదాహరణ...

ఒకే వ్యక్తి నుంచి రూ.కోటికిపైగా అక్రమ డిపాజిట్లు

మార్గదర్శిలో ఓ చందాదారునికి 24 చిట్టీలున్నాయి. ఆయన నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ 'రశీదు' రూపంలో రూ.కోటికు పైగా డిపాజిట్లు వసూలు చేసింది. దీనిపై ఆ సభ్యుడిని విచారించగా విస్మయకర అంశాలు వెల్లడయ్యాయి. టీడీఎస్ మినహాయించుకోకుండా తాము డిపాజిట్లు సేకరిస్తున్నామని మార్గదర్శి చిట్స్ తనకు చెప్పిందని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే టీడీఎస్ చెల్లించాలి. అదే మార్గదర్శిలో అయితే టీడీఎస్ అవసరం లేదని చెప్పి ఆయన్ని ఆకర్షించారు. ఇది ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నేరం. నిజానికి గతంలో మార్గ దర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఎలాంటి అనుమతు లూ లేకుండా రూ.2,600 కోట్లు డిపాజిట్లుగా వసూలు చేశారు. దీన్ని నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ బయటపెట్టడంతో కేసులు నమోద య్యాయి. విచిత్రమేంటంటే కేసులు కొనసాగు తుండగా... నేరాన్ని కప్పిపుచ్చుకోవటానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను రామోజీ రావు మూసేశారు. ఇలా డిపాజిట్లు సేకరించటం ఐటీ చట్టం ప్రకారం నేరం. ఎంత సేకరి స్తే అంత మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐటీ కూడా రామోజీకి నోటీసులు జారీ చేసింది. దానిపైనా పలు కేసులు నడుస్తున్నాయి. అలాంటి సమయంలో సంస్థను కుట్రపూరితంగా మూసేయ టమే కాక... ఇపుడు చిట్స్ ముసుగులో రకరకాల పేర్లతో డిపాజిట్లు సేకరిస్తుండటం గమనార్హం.

మేనేజర్ల పేరిట మరో పన్నాగం...

అవినీతి బాగోతం బయటపడే సమయంలో దానికి సాంకేతిక కారణాలు చూపించి తప్పించుకోవటంలో రామోజీది అందెవేసిన చెయ్యి. అదే తరహాలో చిట్స్ విషయంలోనూ ఈ ఉల్లంఘనలన్నింటినీ తమ బ్రాంచి మేనేజర్ల(ఫోర్‌మెన్) నెత్తిన రుద్దీ తప్పించుకునే దుర్మార్గానికి తెరతీశారు రామోజీ. కానీ స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఈ కేసును శాస్త్రీయంగా అధ్యాయనం చేసి... తగిన ఆధారాలు సేకరించడం ద్వారా రామోజీ ఎత్తును చిత్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు బయటపడగానే రామోజీరావు తన ఈనాడు పత్రికలో అరపేజీ ప్రకటన ఇచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించి అన్ని వ్యవహారాలు బ్రాంచి మేనేజర్లే మాత్రమే చూస్తారు ...సర్వాధికారాలు వారివేనని అందులో పేర్కొన్నారు. అంతేకాదు తెలంగాణ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో అదే మాట చెప్పారు. తద్వారా బ్రాంచి కార్యాలయాల్లో అక్రమాలతో తనకు సంబంధం లేదని చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారు. కానీ స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగాలు రామోజీరావు కుట్రను సమర్థంగా తిప్పికొట్టాయి. ఎందుకంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు కేవలం నిమిత్త మాత్రులు. వారికి తమ బ్రాంచిలోని ఖాతాలకు సంబంధించి కనీసం చెక్ పవర్ కూడా లేదు. అంటే వారికి సర్వాధికారాలు ఉన్నాయని రామోజీ ఇచ్చిన ప్రకటనలో గానీ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో గానీ చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది స్పష్టమైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అన్ని అక్రమాలకు రామోజీరావు, ఆయన కోడలు శైలజే పూర్తి బాధ్యులనేది సుస్పష్టం.

జెండాను గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు కృతజ్ఞతలు

● పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్



సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. '12 వసంతాలు పూర్తి చేసుకుని, నేడు 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు, కార్యకర్తలకు, నాయకులకు, రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. గత 12 ఏళ్లుగా ప్రయాణంలో నాతో నిలబడి, నాకు వెన్నుదన్నుగా ఉన్న ప్రతి ఒక్కరికీ, మన పార్టీ జెండాను తమ గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు. మన ప్రయాణం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతూ ఉండాలని కోరుకుంటున్నాను' అని ఆదివారం ట్వీట్ చేశారు.



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు వైఎస్సార్‌సీపీ ఓ రోల్ మోడల్ అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీని దేశంలోనే ఆదర్శవంతమైన పార్టీగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జల.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మరోవైపు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు, నేతలు పండగలా నిర్వహించారు.

ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుంది

● అరెస్టు చేస్తే చేయనివ్వండి.. నేను అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా
● కడపలో మీడియాతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
● వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ విచారణ కోసం హాజరైన భాస్కర్‌రెడ్డి



కడప అర్బన్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కీలకమైన ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 12న తమ ముందు విచారణకు హాజరుకావాలని సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయన కడప కేంద్రకారాగారంలోని గెస్ట్‌హౌస్‌లో ఉన్న సీబీఐ అధికారుల ముందు హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ సీబీఐ అధికారులెవరూ అందుబాటులో లేరు. మళ్లీ నోటీసులు ఇస్తామని, అప్పుడు విచారణకు హాజరుకావాలని అక్కడి సిబ్బంది సూచించడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అవినాశ్‌రెడ్డి అన్ని విషయాలు చెప్పారని, తాను చెప్పేదేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం సహకరించకపోయినా విచారణకు సహకరించాలనే ఉద్దేశంతో వచ్చానన్నారు. విచారణ అధికారులు అందుబాటులో లేరని, మరోసారి నోటీసులు ఇస్తామని చెప్పారని తెలిపారు. తిరిగి తనకు నోటీసులు ఇస్తే విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ఈ కేసు పరిష్కారం కావాలంటే వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో వెలుగుచూసిన లేఖ బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లేఖ బయటకు వస్తేనే అన్ని విషయాలు బయటకొస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో తాను ఇంతకంటే ఏమీ చెప్పలేనని వ్యాఖ్యానించారు. అరెస్టుపై జరుగుతున్న ప్రచారంపైన కూడా ఆయన స్పందించారు. కేసు తప్పుదోవ పట్టిస్తున్నారని చెబుతూ.. 'అరెస్టు చేసుకుంటే చేసుకోండి, అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా..' అని చెప్పారు.

నేడు మందకృష్ణ రాక

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనపై నిజ నిర్ధారణ కోసం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సోమవారం మన్ననూర్‌కు వస్తున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ కాశీం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో నిఖిత మృతికి సంబంధించి వివరాలు తెలుసుకోవడంతోపాటు కుటుంబాన్ని ఆదుకునే విషయమై ఆందోళన చేపట్టే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి సంఘీభావంగా ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని కుల, ప్రజా సంఘాల నాయకులు పాఠశాల వద్ద నిర్వహించే చర్చా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైద్య విద్యార్థినికి బంగారు పతకం



రవిచిన్మయి

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌కు చెందిన నందీశ్వరస్వామి, పల్లవి దంపతుల కుమార్తె రవిచిన్మయి బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి మెడిసిన్‌లో సీటు సాధించడమేగాక.. మొదటి ఏడాదే బంగారు పతకం అందుకోవడంతో మండల ప్రజలు అభినందించారు.

వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వాల్మీకి దేవాలయంలో ఇంటింటికి వాల్మీకి మహర్షి కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కులధ్రువపత్రం సాధించే దాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. తమ జాతిని చైతన్యం చేసేందుకు ఇంటింటికి వాల్మీకి సందేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎస్టీ జాబితాలో చేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని క్షేత్రస్థాయిలో ఎండగడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మణ్, కృష్ణ, శ్రీను, వెంకట్రాములు, శివకుమార్, నాగరాజు, శేఖర్, శ్రీనివాసులు, చిన్నచంద్రయ్య, రాజు, శివశంకర్ పాల్గొన్నారు.



రైల్వేట్రాక్ దాటుతున్న పాతబజార్‌వాసులు



రోడ్డు మూసివేయటంతో పక్కసందులో నుంచి వెళ్తున్న పాతబజార్‌వాసులు



గూడ్స్ రైలు కింద నుంచి దాటుతూ..

రైలు దిగాక.. ఫీట్లు తప్పవిక!

జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఏడాదిగా అవస్థలు పడుతున్నారు. స్టేషన్ పక్కనే ఉన్న పాత బజార్ నుంచి కొత్తబజార్‌కు వెళ్లేందుకు ట్రాక్ వద్ద ఫీట్లు వేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికాలంగా గేట్ పూర్తిగా మూసి ఉంచారు. అలాగే ఇటీవల ఆర్‌యూబీ నిర్మాణం కోసం రోడ్ పూర్తిగా మూసివేయటంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో పాతబజార్ నుంచి కొత్తబజార్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికోసం రైల్వేట్రాక్ దాటుతున్నారు. రోడ్డు మూసిన ప్రాంతం పక్కన సందులో నుంచి మురికికాల్వలు దాటుకుంటూ ట్రాక్ అవతలకు వెళ్తున్నారు. రాత్రిళ్లు ఇక్కడ లైట్లు లేకపోవడంతో కాల్వలో పడిపోయే ప్రమాదం ఉంది. అలాగే ట్రాక్‌పై గూడ్స్ రైలు నిలిపితే రైలుడబ్బాల కిందనుంచి దూరి వెళ్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు, సామాగ్రి ఉన్న వారి పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ సమస్యపై రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, తగిన ఏర్పాట్లు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– జడ్చర్ల టౌన్

ఆర్డీఎస్‌కు నీరు వచ్చేనా?

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ నీళ్ల కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో ప్రవహించే ఆర్డీఎస్ ప్రధాన కాల్వల్లో ఐదు రోజులుగా నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చి 15 వరకు తప్పనిసరిగా నీరందిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్డీఎస్ పరివాహక ప్రాంతంలో మొక్కజొన్న, సీడు జొన్న, మినుములు, కూరగాయ పంటలను సాగుచేశారు. పంటలు చివరి దశకు చేరుకున్నాయి. చివరి తడులు పంటలకు అందిస్తేనే దిగుబడి బాగా వస్తుందని, చివరి తడులు ఇవ్వకపోతే తాలు మిగులుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్ అధికారులు స్పందించి తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ వెంటనే ప్రారంభించి పంటలకు చివరి తడులు ఇచ్చేందుకు నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా రాష్ట్ర వాటాగా పెట్టిన చివరి ఇండెంట్ నీరు తుమ్మిళ్ల లిఫ్ట్ వరకు చేరలేదు. దీంతో లిఫ్ట్ మోటార్ ప్రారంభించలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం తుంగభద్ర నది సమీపంలోని తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద 290.9 అడుగుల మేర నీరు ఉంది. నీటి మట్టం 291.2 చేరితే తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఇండెంట్ నీరు సోమవారం మధ్యాహ్నం తుమ్మిళ్ల వద్దకు చేరే అవకాశం ఉందని, సాయంత్రం మోటార్ ఆన్ చేసేందుకు కృషిచేస్తామని ఏఈ వివరించారు. కేసీ కెనాల్‌కు నీటిని ఎక్కువగా వాడుకుంటున్నందువల్లే తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద బ్యాక్ వాటర్ తగ్గుతుందని, దీంతో లిఫ్ట్ మోటార్‌కు నీరందని పరిస్థితి నెలకొందని ఏఈ వివరించారు.

ఆనకట్ట వద్ద కొనసాగుతున్న ఓవర్‌ఫ్లో

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఆదివారం ఓవర్‌ఫ్లో కొనసాగింది. ఆనకట్ట వద్ద 1090.5 మీటర్ల మేర ఉండగా 3,291 క్యూసెక్కుల నీరు దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీ వైపు ప్రవహిస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు వివరించారు. ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి విడుదలవుతున్న నీరు కర్ణాటక పరిధిలోని 3.2 కిలోమీటర్ వద్ద 8.2 అడుగుల మేర ప్రవహిస్తూ 638 క్యూసెక్కులు తెలంగాణ సరిహద్దు వైపు ప్రవహిస్తున్నాయి. తెలంగాణ సరిహద్దు సింధనూర్ 42.60 వద్ద 4.8 అడుగులు ప్రవహిస్తూ దిగువకు 331 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. నీటి ఫ్లో లేకపోవడంతో డిస్ట్రిబ్యూటరీ 23 వరకు రాగానే నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దిగువన ఉన్న డి–24 నుంచి డిస్ట్రిబ్యూటరీలకు సాగునీరందడంలేదు. వెంటనే ఆర్డీఎస్ అధికారులు స్పందించి ఆయకట్టు పొలాలకు సాగు నీరందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



వడ్డేపల్లి మండలం జూలెకల్ శివారులో ఆర్డీఎస్ కెనాల్‌లో నిలిచిన నీటి ప్రవాహం

అక్రమార్కులకు కొమ్ముకాయడం సిగ్గుచేటు

● బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట: ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులకు అండగా నిలుస్తూ ఖనిజ సంపదను కాంట్రాక్టర్లకు దోచిపెట్టేలా వ్యవహరించడం సిగ్గుచేటని, అక్రమాలకు కొమ్ము కాస్తున్న మైనింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని అమడబాకుల శివారు పులిగుట్టలో అక్రమ తవ్వకాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం కొత్తకోటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులిగుట్టపై తవ్వకాలు నిలిపివేయాలని, అనుమతి పత్రాలు చూపించాలని అడిగిన గ్రామస్తులపై సదరు కాంట్రాక్టర్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి ఒకేరోజు గ్రామస్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. మనిగిళ్ల శివయాదవ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎందుకు స్పందించడం లేదన్నారు. ఆర్డీఓ చర్చల పేరిట గ్రామస్తులను పిలిచి తవ్వకాలకు సహకరించాలని కోరడం విడ్డూరంగా ఉందని, నిజంగా అనుమతి ఉంటే పత్రాలు చూపించకుండా పోలీసులతో భయపెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పులిగుట్టపై జాతీయ బీసీ కమిషన్‌లో ఫిర్యాదు చేశామని.. జిల్లా అధికారులు ఢిల్లీకి తిరగాల్సి ఉంటుందని తెలిపారు. లీజు ముగిసిన తర్వాత గ్రామకమిటీ తీర్మానం చేకుండా పునరుద్ధరించే అవకాశం లేదని.. కాలుష్య నియంత్రణ మండలి సర్టిఫికెట్ కూడా లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలకు యత్నిస్తున్న కాంట్రాక్టర్లు, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంజన్నయాదవ్, మహేందర్, శేఖర్, రాములు యాదవ్, సురేంద్రాచారి, ప్రకాష్‌శెట్టి, బాలరాజు, చంద్రశేఖర్, కురుమూర్తి, సాయి, రామాంజనేయులు, కృష్ణమోహన్, గణేష్, శివ, రాజు, వెంకటేష్, భాస్కర్, బాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని డ్రాగన్ షోటోకాన్ కరాటే దు ఇండియా క్లబ్ ఫౌండర్, చీఫ్ సొలంబిన్ ఉమర్ అన్నారు. డ్రాగన్ కరాటే షోటోకాన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని జేఆర్ ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా వివిధ బెల్టులు అందజేశారు. గ్రేడింగ్ పరీక్షలో 300 మంది విద్యార్థులు పాల్గొనగా, 160 మంది ఎల్లో, 50 మంది గ్రీన్, 20 మంది ఆరెంజ్, 35 మంది బ్లూ, 12 మెరూన్, 23 బ్రౌన్, ఆరుగురు బ్లాక్‌బెల్టులు పొందినట్లు తెలిపారు. కరాటే చాంపియన్‌షిప్ ఆయా విభాగాల్లో స్వప్న, కృష్ణవేణి, మహేశ్వరి, అనూష బంగారు, పవిత్ర, ప్రవళిక, శిరీష, అనసూయ రజత పతకాలు, ఆర్.వైష్ణవి, అనిత, రాధిక, స్వప్న, తిరుపతమ్మ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు. సొలంబిన్ ఉమర్ మాట్లాడుతూ ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఇందులో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని అన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ అమ్రేష్, డ్రాగన్ షోటోకాన్ కార్యదర్శి షేక్ అబ్దుల్‌సలాం, మాస్టర్లు సలీం, ఎస్‌కే.మోసీన్, మౌనిక, శేఖర్, కె.వెంకటేష్, అఖిల, అర్పిత్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు